"వండర్ ఫుల్. నౌ మిస్టర్ రాజేంద్ర. ఓ ప్రపంచ ప్రముఖ శాస్త్రజ్ఞుడు ప్రారంభించిన దినపత్రిక పేరు గ్రాండ్ ట్రంక్ హెరాల్డు. ఎవరా శాస్త్రజ్ఞుడు. ఆ పత్రిక ప్రత్యేకతేమిటి."

రాజేంద్ర మొహం వివర్ణమైపోయింది.

ఈ ప్రశ్నకి జవాబు తెలియకపోవడంతో ఉక్రోషంగా దిగువనున్న రంగధాం కేసి చుశాడు. తప్పదు. తను ఓడిపోతున్నాడు. తప్పదు తన తండ్రి పరపతి సైతం మట్టికొట్టుకుపోతుంది.

బజర్ మోగిన చప్పుడు వినిపించింది.

ఆ క్షణాన రంగధాం లేచి బయటకి వెళ్ళటాన్ని రాజేంద్ర తప్ప అక్కడెవరూ గమనించలేదు.

"మిస్టర్ విశ్వనాథ్. జవాబు చెప్పాల్సింది ఇక మీరే"

"గ్రాండ్ ట్రంక్ హెరాల్డుని ప్రారంభించింది ప్రముఖ శాస్త్రజ్ఞుడు థామస్ అల్వా ఎడిసన్. ఈ దిన పత్రిక ప్రత్యేకత ఇది ప్రతిరోజూ నడుస్తున్న ట్రైన్‌లో ప్రింటయ్యేది."

"మార్వలెస్. నౌ మిస్టర్ రాజేంద్ర. ప్రపంచంలో యింతవరకూ జరిగిన అంత్యక్రియల్లో అతి ఖరీదైనదిగా చెప్పుకునేదెవరిది"

"1989వ సంవత్సరం ఫిబ్రవరి ఇరవై నాలుగున చనిపోయిన జపాన్ చక్రవర్తి హీరో హిటో అంత్యక్రియలకి ఖర్చుచేసింది సుమారు ఎనభై మిలియను డాలర్లు. ప్రపంచంలో యింతవరకూ అత్యధిక మొత్తం ఖర్చు చేయబడిన అంత్యక్రియ ఇదే."

"రైట్, నౌ మిస్టర్ విశ్వనాథ్. క్రీస్తు శకం 1772 వ సంవత్సరానికి చెందిన ఓ రిపోర్టు ప్రకారం ప్రపంచంలోని ఓ ప్రాంతానికి చెందిన స్త్రీలు ప్రసవిస్తుండగా నొప్పులు మగవాళ్ళకి వచ్చేవి. అలా రావడానికి కారణం మంత్రసాని తన శక్తితో ఆ నొప్పిని భర్తకి ట్రాన్స్‌ఫర్ చేయడమే. ఇది సైన్సుకి అందని ఓ మిస్టరీ అయినా అసలు ఆ ప్రాంతం ఏది."

"స్కాట్‌లాండ్‌కి చెందిన డంప్రైస్."

"రైట్. మరో మూఢనమ్మకానికి చెందిన ప్రశ్న మిస్టర్ రాజేంద్ర. ప్రాచీన కాలం నుంచీ ఓ దేశంలోవున్న నమ్మకం ఏ బిడ్డయినా పుట్టేటప్పుడు గోడ గడియారం మూడు, ఆరు, తొమ్మిది లేక పన్నెండు గంటలు కొడితే ఆ బిడ్డకి దెయ్యాల్ని చూసే శక్తి వస్తుందట. అది ఏ దేశం?"

"బ్రిటన్"

"రైట్. నౌ మిస్టర్ విశ్వనాథ్. దృష్టిదోషం నుంచి తప్పించుకోటానికి పెళ్ళితంతు పూర్తి అయ్యేంత దాకా వధువు కళ్ళు మూసుకునే వుంటుంది. ఈ ఆచారం ఏదేశానికి చెందింది."

"మొరాకో"

"రైట్ మిస్టర్ రాజేంద్ర. ప్రపంచంలో మంత్రిపదవినలంకరించిన తొలి మహిళ"

"సియావో బండారు నాయకే"

"రాంగ్"

రాజేంద్ర మొహం పాలిపోయింది.

బజర్ చప్పుడు వింటూ విశ్వనాథ్‌ని అడిగాడు సత్యేంద్ర "ఇట్స్ యు టు ఆన్సర్ మిస్టర్ విశ్వనాథ్"

"పార్డన్మీ"

"మీరు జవాబు చెప్పాలి

మొహంపై అలుముకుంటున్న ప్రేతకళ అతడి ఆలోచనాశక్తిని హరించివేస్తుంటే "ఏం జరిగింది మీకు" అన్నాడు సత్యేంద్ర ఆందోళనగా "ప్రపంచ రాజకీయాలలో మంత్రి పదవిని అలంకరించిన తొలి మహిళ ఎవరు?"

"1917లో..." పదాల్ని కూడబలుకుతున్నాడు విశ్వ. అదికాదు. తెలిసింది కూడా సరిగా జ్ఞప్తికి రావడం లేదు. "లెనిన్ బోల్షివిక్ గవర్నమెంట్‌లో. . ."

"కేరీ ఆన్ " ఉత్సాహ పరిచాడు సత్యేంద్ర. "కమాన్ - మీరు కరెక్టుగానే ఆలోచిస్తున్నారు"

"ఇది అన్యాయం" అరిచాడు రాజేంద్ర ఆవేశంగా లేచి. . . "చెప్పలేనివాడిచేత క్లూ యిచ్చి మరీ చెప్పించాలని ప్రయత్నిస్తున్నాడు క్విజ్ మాస్టర్"

"ప్లీజ్ బీ సిటెడ్" ఆదేశంలా అన్నాడు సత్యేంద్ర రాజేంద్రని చూస్తూ "ఈ పోటీలో క్విజ్ మాస్టర్ న్యాయ నిర్ణేత. నన్ను నిలదీయటం నియమాల్ని ఉల్లంఘించటం అవుతుంది"

రాజేంద్ర అవాక్కయిపోవడంతో అతడికి వత్తాసుగా చప్పట్లు కొట్టాలనుకున్న విద్యార్థులూ నిశ్శబ్దంగా వుండిపోయారు.

ఈ చర్చలకీ చప్పట్లకీ అతీతంగా ఓ భ్రాంతి లాంటి స్థాయికి ఎప్పుడో చేరిపోయిన విశ్వ కూడ బలుక్కుంటూ అన్నాడు "లెనిన్ గవర్నమెంటులో సోషల్ వెల్ఫేర్ మినిస్టర్‌గా పనిచేసిన అలెగ్జాండ్రా కొలంతాయ్ తొలి మహిళ."

"యూ ఆర్ వెరి కరెక్ట్ మిస్టర్ విశ్వనాథ్. . . ఇట్స్ యువర్ టర్న్ మిస్టర్ రాజేంద్ర - ప్రపంచంలో అరవై శాతం లాయర్లు వున్న దేశం ఏది."

"ఇండియా. . ."

"రాంగ్. .."

"చైనా"

"రాంగ్"

"బ్రిటన్"

బజర్ మోగడంతో విశ్వనాథ్‌ని అడిగాడు సత్యేంద్ర. ఈసారి గొడవకి అవకాశం లేకుండా ప్రశ్నని రిపీట్ చేశాడు. "మిస్టర్ విశ్వనాథ్. ప్రపంచంలోని అరవై శాతం లాయర్లున్న దేశం. . ."

"అమెరికా"

"కరెక్ట్- " క్షణం రాజేంద్రకేసి చూసి అడిగాడు "ప్రపంచంలో తొలి స్టంట్ మేన్ ఎవరు"

"పాస్" ఉక్రోషంగా అరిచాడు రాజేంద్ర. . .

బజర్ మోగగానే చెప్పాడు విశ్వనాథ్ "1908లో ది గ్రేట్ ట్రెయిన్ రోబరీలో నటించిన

ఫ్రేంక్ హానేల్”

“రైట్. . .” క్షణం ఆగిన క్విజ్ మాస్టర్ సత్యేంద్రబసు వున్నట్టుండి పాకెట్‌లో నుంచి కొన్ని కార్డ్స్ తీశాడు. “ఇప్పుడు మన దేశానికి ముఖ్యంగా తెలుగు రాష్ట్రానికి సంబంధించిన కొన్ని ప్రశ్నలు అడగబోతున్నాను. మిస్టర్ రాజేంద్రా. . .”

అలర్టయ్యాడు రాజేంద్ర. నష్టపోయింది తిరిగి రాబట్టుకోవడానికిదో అవకాశంలా వుత్సాహంగా చూశాడు. “పులికాట్ సరస్సు మధ్యలో వున్న ద్వీపం ఏది”

టక్కున చెప్పాడు రాజేంద్ర “శ్రీహరి కోట”

“మిస్టర్ విశ్వనాథ్. . . పొట్టి శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష నిర్వహించింది ఎవరి ఇంటిలో?”

“బలుసు సాంబమూర్తిగారి ఇంటిలో. . .”

“రైట్. . . నౌ మిస్టర్ రాజేంద్రా. . . వ్యవహారిక భాషోద్యమానికి నాయకత్వం వహించిందెవరు. . .”

“పానుగంటి లక్ష్మీనరసింహరావు.”

“రాంగ్”

“వీరేశలింగం పంతులుగారు”

“నో. . .”

ముప్పై సెకండ్లు గడిచిపోయింది.

“మిస్టర్ విశ్వనాథ్. . . వ్యవహారిక భాషోద్యమానికి నాయకత్వం వహించిందెవరు?”

“గిడుగు. . .” హెలూసినేషన్‌లో తేలిపోతున్నట్టు నిస్సత్తువగా గొణుగుతున్నాడు విశ్వ... రామమూర్తో వేంకట రామమూర్తో స్ఫురించడం లేదు. “యస్. . . గిడుగు వెంకట రామమూర్తి పంతులు”

“వెరీ కరెక్టు. . నౌ మిస్టర్ రాజేంద్ర. . . తెలుగు ప్రసిద్ధ చిత్రకారుడు ఎవరు?”

“దామెర్ల రామారావు. . .”

“రైట్. . .” క్షణం ఆగి అన్నాడు క్విజ్ మాస్టర్ “ది లాస్ట్ క్వశ్చనాఫ్ ది ఫస్ట్ సెషన్ - మిస్టర్ విశ్వనాథ్ శబ్ద రత్నాకరం అనే నిఘంటువుని రచించింది ఎవరు.”

“బహుజనపల్లి సీతారామాచార్యులు”

“నౌ మిస్ రీటా మొదటి సెషన్‌కి సంబంధించిన స్కోర్ తెలియచేస్తుంది” అన్నాడు సత్యేంద్రబసు-

“మొత్తం ఏభై నిముషాలలో అడిగిన ప్రశ్నలు ముప్పై. మిస్టర్ విశ్వనాథ్ పందొమ్మిది ప్రశ్నలకి నూరు శాతం జవాబు చెప్పి నూట తొంభై మార్కులు స్కోరు చేయగా పది ప్రశ్నలకి జవాబులు చెప్పిన రాజేంద్ర వంద మార్కుల్ని సాధించగలిగారు - క్విజ్ మాస్టరు దక్కించుకున్నది పది మార్కులు. . .”

సగానికి పైగా ఆడిటోరియం నిశ్శబ్దంగా చూస్తుండగా మేధస్సుని నిజాయితీగా హర్షిస్తున్న విద్యార్థులు, పత్రికా విలేకర్లు విశ్వనాథ్‌కి అనుకూలంగా చప్పట్లు కొడుతుంటే కృషి సైతం తనను తాను మరిచి పోయింది-

ఆ క్షణంలో విశ్వు విధించిన షరతు ఆమెకు గుర్తు రాలేదు.

సైనికుడిలా అతడు సాగిస్తున్న పోరాటాన్నే గమనిస్తోంది.

"నౌ- లెట్స్ గో టు ది ఫైనల్ సెషనాఫ్ ది కాంపిటీషన్"

మిగతా పదినిముషాల కార్యక్రమాన్ని కొనసాగించాలనుకుంటుండగా కనిపించింది-

పోలీసులు దూసుకొస్తున్నారు లోపలికి.

ఏం జరుగుతున్నదీ అర్థంకాక అందరూ నిశ్చేష్టులవుతుండగానే డయాస్‌పైకి వచ్చేశారు-

"ఏం జరిగింది. ఏమిటిదంతా" అడిగింది కృషి వారికి అడ్డంగా నిలబడి-

"సారీ మేడమ్ - ఈ కాంపిటీషన్ జరగటానికి వీల్లేదు- " జవాబు చెప్పిన పోలీసాఫీసర్ దూకుడుగా విశ్వనాథ్‌వైపు నడిచాడు-

జారిన షాల్ వెనుక రక్తసిక్తమైన విశ్వు శరీరం ఆమెలో ఎంతటి ఆందోళన రేపిందీ అంటే కెవ్వుమనబోతూ ఆగింది-

అంతసేపూ ప్రాణాలను ఉగ్గబట్టుకుని క్షతగాత్రుడయిన సైనికుడిలా పోరాడిన విశ్వు యిక ఓపిక నశించినట్టు తలవాల్చేశాడు.

హఠాత్తుగా ఆడిటోరియంలో హోరు మొదలయింది . . . జనం పదులు వందల సంఖ్యలో డయాస్ పైకి తోసుకొస్తుంటే "వాట్ హేపెండ్" కంగారుగా అడిగింది.

ఆ క్షణంలో కూడని షరతు విధించిన విశ్వుపై కోపం లేదు- గెలుపు కోసం అతడు సాగించిన సంగ్రామానికి అసాధారణంగా స్పందించిపోతూ అతడికి చేయూతనివ్వాలన్న వివశత్వానికి లోనైంది.

"చూశారుగా మేడమ్- హి యీజ్ స్టేబ్డు - ఇతడిపై హత్యా ప్రయత్నం జరిగింది. ఈ స్థితిలో ఈ వ్యక్తికి కావాల్సింది ప్రాణం నిలుపుకోవడమా పోటీలో నెగ్గడమా-"

యస్సైన్ అన్న మాటల్లో విశ్వుపై సానుభూతి కన్నా పోటీలో నెగ్గకూడదన్న ఆలోచనే ధ్వనించింది.

ఇలా జరగటానికి కారణం ఏమిటీ అన్నది తెలుసుకోవడానికి తర్క శాస్త్రంలో ప్రావీణ్యత అవసరం లేదు. మామూలు అవగాహన చాలు. ఓ పథకం ప్రకారం విశ్వు పోటీకి రాకుండా ఏర్పాటు జరిగితే గాయపడి యిటు వచ్చాడు.

అది యిచ్చిన మాట నిలబెట్టుకోవాలన్న ఆలోచనో లేక గెలిచి తీరాలన్న దృఢ సంకల్పంతో చేసిన సాహసమో ఆమెకీ తెలీదు. కాని విశ్వుని అభినందించకుండా వుండలేకపోయింది.

వెంటనే చేయాల్సిన కార్యక్రమం మరొకటుంది.

చరిత్రలో చాలా ట్రేజడీలకి కారణం మంచికీ, చెడుకీ జరిగిన పోరాటాలు మాత్రమే కాదు, చెడుకీ చెడుకీ జరిగిన యుద్ధాలు కూడా. . . విశ్వ వ్యక్తిగతంగా ఎలాంటి వాడయినా గాని చాలా శత్రువులున్నాగాని మరో శత్రువు చేత గాయపరచబడినవాడు .... అదీ కూడని సమయంలో.

ఏ కథకయిన ఓ గమ్యం నిర్ధేశించబడటానికి కథానాయకుడు అవసరమన్న సత్యమే నిజమయితే ఈ రోజు విశ్వ హీరో. అది అందరికీ తెలియ చెప్పాలి. . .

అక్కడున్న పత్రికా విలేకర్లను గుర్తించిన కృషి అవకాశాన్ని జారవిడుచుకోలేదు.

క్విజ్ మాస్టర్ సత్యేంద్రబసు ఆధ్వర్యంలో ప్రెస్ కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసింది అదే ఆడిటోరియంలో.

ఆ విషయాన్ని గుర్తించకపోవడం ఇంత తెలివినీ ప్రదర్శించిన లాయర్ రంగధాం పొరపాటు.

0 0 0 0

అపరాత్రి దాటుతోంది. . .

చీకటి కాటుక క్రీ నీడల్లో నగరానికి ఓ మూల విద్యుద్దీపాలనడుమ అపోలో హాస్పిటల్.

ఆపరేషను థియేటరు బయట కూర్చుని వుంది కృషి. . .

ప్రెస్ కాన్ఫరెన్స్ ముగించి సరాసరి ఇటు వచ్చిన కృషి మూడు గంటలుగా అక్కడే కూర్చుని వుంది.

స్పృహ కోల్పోయిన విశ్వ రూపం ఒక్కటే కాదు - మొన్నెప్పుడో కారులో కూర్చుని బెదిరించి మరీ డబ్బు లాక్కుపోయిన విశ్వ - ఆ తర్వాత మేధావిలా కనిపించి గెలిస్తే ఒక రాత్రి నాతో గడపగలవా? అన్న విశ్వ కళ్ళలో చిలిపితనమూ గుర్తుకొస్తుంటే బడలికగా కళ్ళు మూసుకుంది.

విశ్వ బ్రతుకుతాడా. . .

అసలు తను బ్రతకాలనే కోరుకుంటుందా.

అలా కోరుకోని నాడు తన స్థాయి దిగి ఇలా ఎందుకు వచ్చింది.

మొన్న అతడు విధించిన షరతు కన్నా లక్ష్యం కోసం ప్రాణాలు సైతం ఒడ్డగల అతడి మొండితనమే జ్ఞప్తికి వస్తుంటే. . .

ఎవరీ మనిషి అనుకుంది. . .

ఎందుకు తనకు పరిచయమయ్యాడు. ..

పదేపదే తన గురించి ఆలోచించే పరిస్థితినెందుకు సృష్టిస్తున్నాడు.

ఇన్ని సార్లు కలవడం కాకతాళీయమా లేక కావాలని జరుగుతుందా. . .

నిద్రలాంటి నిశ్శబ్దంలో మేమున్నామంటూ కదిలే ఆలోచనల పొరల్లో. . . ఎక్కడో, [illegible]

మరకల్లో ఆమె సతమతం అవుతుండగానే ఎవరో పిలిచినట్టయి కళ్ళు తెరిచింది.

ఎదురుగా డాక్టర్ శమంత్. . . అంతసేపూ విశ్శుకి సర్జరీ చేసిన డాక్టర్. . .

“హౌ ఈజ్ హి డాక్టర్” అడిగింది ఉద్విగ్నంగా.

“నిజానికి అంత బ్లీడ్ అయ్యేక ఏ పేషెంటూ బ్రతికే అవకాశం లేదు మిస్ కృషి. కాని మృత్యువుతో చాలా మొండిగా పోరాడుతూ ప్రాణం నిలుపుకున్నాడు. . .”